సాక్షి ఒడిశా

శుక్రవారం । 14 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,30,287లు, బంగారం 250 మిల్లీగ్రాములు, వెండి 44గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సీఎం నివాసం ముట్టడికి..

సీఎం నివాసం ముట్టడికి యువజన కాంగ్రెస్ సభ్యులు ప్రయత్నించారు. కానీ విఫలమయ్యారు.

- 8లో



రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్

ఒడిశాలో త్వరలో ఆయుష్మాన్ భారత్ రానుంది. ఈ మేరకు సీఎం ప్రకటించారు.

- 8లో

న్యూస్‌రీల్

చెరువులో యువతి మృతదేహం లభ్యం



చెరువు ఒడ్డున యువతి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి బుటిగూడ గ్రామ చెరువులో గురువారం ఉదయం ఒక యువతి మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. కొద్దిరోజుల క్రితం సోమనాథ్‌పూర్ గ్రామానికి చెందిన దాలిమా పూజారి(25) అనే ఈ యువతి ఆంధ్రప్రదేశ్‌లోని రొయ్యల కంపెనీలో పనికి వెళ్లింది. అక్కడ ఈమెకు బుటిగూడ గ్రామానికి చెందిన యువకుడితో పరిచయం ఏర్పడడంతో అతడితో పాటు బుటిగూడకు వచ్చింది. అయితే ఏమైందో ఏమో గానీ గురువారం ఉదయం చెరువులో మృతదేహమై తేలింది. కాగా బుధవారం ఆమె చెరువు వద్ద దుస్తులు ఉతుకుతూ కనిపించిందని, బహుశా అప్పుడే జారిపడి మరణించి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటన స్థలానికి బలిమెల పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఐఐసీ ధీరజ్ పట్నాయక్ తెలిపారు.

యువతులకు కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టుమిషన్లు అందుకుంటున్న యువతులు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి కార్యాలయంలో ఉత్కళ వీకర్ సెక్షన్ డవవప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో యువతులను ప్రోత్సహించేందుకు కుట్టు మిషన్లు పంపిణీ చేపట్టారు. గ్రామంలోని యువతులు ఆర్థికంగా ఎదిగేందుకు కుట్టు మిషన్లు అందజేయడంతో పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. పోడియా గిరిజన అభివృద్ధి అధికారి అశ్విని కుమార్ మహాపాత్రో మాట్లాడుతూ.. యువతులు శక్తివంతమైతే సమాజం కూడా అభివృద్ధి దిశలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్కళ మైనారిటీ వీకర్ సెక్షన్ డవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ డా.ఎస్.రాఘువరావు, చీనం జనార్దన్, మేషాక్ రవి తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబాలను ఆదుకోండి



వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన మహిళలు

జయపురం: తమ కుటుంబాలను ఆదుకోవాలని జయపురం గగణాపూర్ సేవా పేపరు మిల్లులో పనిచేసి మృతి చెందిన కార్మికుల భార్యలు సబ్ కలెక్టర్ ఎ.శౌర్య రెడ్డిని కోరారు. ఈ మేరకు కలెక్టర్‌ను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. తమ భర్తలు మరణించిన తర్వాత దుర్భరమైన జీవితం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2020లో కొత్త యాజమాన్యం మిల్లు బాధ్యతలు చేపట్టిన తర్వాత తమకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించలేదని వాపోయారు. అలాగే చెల్లించాల్సిన పీఎఫ్, పెన్షన్, గ్రాట్యూటీ బకాయిలు సైతం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి నేతృత్వంలో మృతుల భార్యలు రుక్మిణి సౌర, జి.రాణి చౌదరి, కుణీ మండి, మీనతీ పుష్టి తదితరులు సేవా మిల్లు ప్రధాన గేటు ముందు ధర్నా చేపట్టారు.

స్వాభిమాన్ ఏరియాలో చీకట్లు



అధికంగా వచ్చిన కరెంట్ బిల్లుతో ప్రజలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి పాపర్‌మెట్ల పంచాయతీలో వారం రోజులుగా కరెంటు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అదనపు బిల్లులు రావడంతో వినియోగదారులు చెల్లించలేదు. దీంతో కరెంటు అంతరాయాలు తప్పడం లేదు. బిల్లులు వేలల్లో వచ్చాయని, అధికారులు స్పందించాలని కోరుతున్నారు. రెండు మూడు రోజుల్లో విద్యుత్ సదుపాయం పునరుద్ధరించకపోతే విద్యుత్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

పోలవరంపై.. గందరగోళం



గాంధీ బొమ్మ దగ్గర బైఠాయించి నిరసన ప్రదర్శించిన కాంగ్రెస్ సభ్యులు



స్పీకరు పీఠం ఆవరణలో విపక్ష సభ్యుల గోల

- స్తంభించిన సభా సమావేశాలు

భువనేశ్వర్: పోలవరం ప్రాజెక్టు వివాదంపై విపక్ష సభ్యులు రచ్చకు దిగడంతో గురు వారం శాసన సభలో గందరగోళం చోటు చేసుకుంది. ఇది సభా సమావేశాలకు తీవ్ర ఆటంకం మారింది. ఈ విషయమై ప్రతిపక్ష బిజూ జనతా దళ్ సభ్యులు నిరసనకు దిగడంతో రాష్ట్ర శాసన సభలో వాతావరణం వేడెక్కింది. ఉదయం సమావేశం ప్రారంభమైన వెంటనే బీజేడీ సభ్యులు పోలవరం ప్రాజెక్టుపై నినాదాలు చేస్తూ సభలో స్పీకరు పీఠం ఆవరణకు తరలి వెళ్లారు. పోలవరం అంశంపై బిజూ జనతా దళ్ వాయిదా తీర్మానం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనని తిరస్కరించడంతో బీజేడీ సభ్యులు నిరసన ప్రదర్శనకు దిగారు. ఈ గందరగోళ పరిస్థితుల మధ్య సభా కార్యక్రమాల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది. దీంతో పలు మార్లు స్పీకర్ సభను వాయిదా వేశారు. రాష్ట్ర స్వార్థ ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటామని, ఈ వివాదం న్యాయ విచారణ పరిధిలో ఉన్నందున సభలో చర్చకు అనుమతించేది లేదనడం ఎంత మాత్రం న్యాయసమ్మతం కాదని బీజేడీ సభ్యుడు అరుణ్ కుమార్ సాహు ఆగ్రహించారు. వివాదం న్యాయ విచారణ పరిధిలో ఉన్నంత మాత్రాన ఇంటికి నిప్పు అంటుకుంటే మంటలు నివారించకుండా చోద్యం చూస్తుంటామా అని నిలదీశారు. పొరుగు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం యథేచ్ఛగా పోలవరం ప్రాజెక్టు పనుల్ని కొనసాగిస్తుందని, వివాదాస్పదంగా ప్రాజెక్టు నిర్ధారిత పరిమిత ఎత్తుని అధిగమించి ఆగడాలకు కాలు దువ్వుతుందని, ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజల స్వార్థ ప్రయోజనాల పరిరక్షణ కోసం సకాలంలో స్పందించకుండా దాటవేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని రచ్చకు దిగారు.

బలహీన స్వభావం

సభలో పోలవరం ప్రాజెక్టుపై చర్చకు విపక్ష బిజూ జనతా దళ్ వాయిదా తీర్మానం ప్రతిపాదించడం బలహీన స్వభావానికి ప్రతీక అని అధికార పక్షం భారతీయ జనతా పార్టీ సభ్యులు ఎదురు తిరిగారు. ఉద్దేశపూర్వకంగా అనవసరమైన గొడవ ప్రేరేపించి అమూల్యమైన ప్రశ్నోత్తరాల సమయాన్ని దాటవేసేందుకు ప్రయత్నం చేయడం తగదని విపక్ష సభ్యులకు హితవు బోధించారు. సభలో విపక్ష బీజేడీ తీరుని రాష్ట్ర ప్రజలు సమీక్షిస్తున్నారు. సభలో ప్రజా సమస్యలను నిర్మాణాత్మక శైలిలో చర్చించకుండా దారి మళ్లించే వైనం పట్ల తగిన సమయంలో రాష్ట్ర ప్రజలు సముచితంగా స్పందించి తగిన శాస్తి చేయడం తథ్యమని భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే ఇరాసిస్ ఆచార్య తెలిపారు. విపక్ష బీజేడీ సభ్యుల తీరుతో సభలో వ్యవసాయ రంగంపై కొనసాగాల్సిన ప్రశ్నోత్తరాలకు గండి పడిందని విచారం వ్యక్తం చేశారు.

సభను బహిష్కరించిన కాంగ్రెస్ సభ్యులు

భువనేశ్వర్: కాంగ్రెస్ శాసనసభ్యుల నిరసన నిరవధికంగా కొనసాగుతోంది. వీరి డిమాండ్లపై ప్రభుత్వ వైఖరి మారనందున సభా సమావేశాల్ని బహిష్కరించినట్లు గురువారం ప్రకటించారు. సభా కార్యక్రమాలకు దూరమై మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో మహిళల పట్ల అత్యాచారాలు ఇతరేతర నేరాలు పెచ్చు మీరుతున్నాయి. ఈ పరిస్థితుల నివారణకు సభా కమిటీ ఏర్పాటు చేయాలనే డిమాండును స్పీకరు పెడ చెవి వైఖరి ప్రదర్శించడంతో ఇటీవల భారతీయ జనతా పార్టీ సభ్యుడు జయ నారాయణ మిశ్రాచ కాంగ్రెసు సభ్యుడు తారా ప్రసాద్ బాహినీపతి మధ్య రాద్ధాంతం చోటు చేసుకుంది. పరిస్థితి చేయి దాటి బాహాబాహీగా మారింది. శాసన సభలో ఈ విచారకర పరిస్థితి సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితుల ప్రభావంతో కాంగ్రెస్ సభ్యుడు తారా ప్రసాద్ బాహిణీపతి వ్యతిరేకంగా స్పీకరు సురమా పాఢి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రభావంతో ఆయనని సభా కార్యకలాపాల నుంచి 7 రోజులపాటు సస్పెండ్ చేసినట్లు స్పష్టం చేశారు. దీంతో పరిస్థితి మరింత బిగుసుకుంది. స్పీకరు ఏకపక్ష ధోరణితో ఈ ఉత్తర్వులు జారీ చేయడాన్ని సహించేది లేదని రచ్చ వీధికి ఎక్కింది. అది మొదలుకొని కాంగ్రెస్ సభ్యులు సభా కార్యకలాపాల్ని బహిష్కరించి గాంధీ బొమ్మ దగ్గర బైఠాయించి నిరసన ప్రదర్శిస్తున్నారు. గురువారం నల్ల పట్టీలు ధరించి నిరసన కొనసాగించారు. ఈ శాంతియుత ఆందోళనలో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త దాస్ ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. ఆయన ఈ సందర్భంగా కాంగ్రెస్ సభ్యులపై సస్పెన్షన్లను వెంటనే ఉపసంహరించుకోవాలని స్పీకరుకు పిలుపునిచ్చారు.

ఆన్‌లైన్ గేమ్‌కు విద్యార్థిని బలి

రాయగడ: మొబైల్‌లో ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడిన ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని రామనగుడ సమితి పరిధిలో పంచాయతీ గణపతిగూడ గ్రామంలో సయినా సాహు అలియాస్ టిన(15) అనే విద్యార్థిని వాళ్ల అమ్మమ్మ వద్ద ఉండేది. ఇటీవల పదో తరగతి పరీక్షలు పూర్తవ్వడంతో ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడింది. ఈ ఆన్‌లైన్ గేమ్స్‌లో భాగంగా మొదట కొంత మొత్తం డబ్బును పోగొట్టుకుంది. అయినా సమయం దొరికినప్పుడల్లా మరలా గేమ్స్ ఆడుతుండేది. ఈ క్రమంలో ఇటీవల రూ.4 లక్షలు గెలుచుకుంది. అయితే తాను గెలిపొందిన నగదును సదరు గేమ్‌కు చెందిన నిర్వాహకులు అకౌంట్‌కు క్రెడిట్ చేయకపోవడంతో మనస్తాపానికి గురైంది. పలు మార్లు కస్టమర్ కేర్‌కు తెలియజేసినా స్పందించకపోవడంతో బుధవారం రాత్రి ఇంటి పెరట్లో చున్నీ సాయంతో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పెరట్లోకి వెళ్లిన సయిన ఇంకా తిరిగి రాకపోవడంతో వాళ్ల అమ్మమ్మ వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించడంతో కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వాళ్లు వెళ్లి చూశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందజేశారు.



సంఘటన స్థలం వద్ద పోలీసులు



సయనా సాహు (ఫైల్)

కాలువలో మునిగి వ్యక్తి మృతి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి సుపులు గ్రామంలో సోమా మాడి అనే వ్యక్తి గురువారం కాలువలో పడి మృతి చెందాడు. సోమా బుధవారం తన పొలంలో కలుపు మొక్కలు తీసేందుకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడి ఊరంతా వెతికారు. ఎక్కడా ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా.. గురువారం సాయంత్రం 3.30 గంటల సమయంలో కాలువలో సోమా మృతదేహాన్ని స్థానికులు గుర్తించి బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. ఐఐసీ రామేశ్వర్ ప్రధాన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు.



విజ్ఞాన సంపదపై చర్చా వేదిక

జయపురం: జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ద్వారా విజ్ఞానం, ఆర్థిక అభివృద్ధి కోసం విజ్ఞానంపై బుధవారం సాయంత్రం చర్చావేదిక నిర్వహించారు. విశ్వవిద్యాలయ మానవ వనరుల విభాగ డైరెక్టర్ డాక్టర్ దేవేంద్ర ఇందోరియ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ దేవీ ప్రసాద్ మిశ్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ద్వారా లభించే విజ్ఞానంపై ప్రసంగించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ మహేశ్వర చంద్ర నాయిక్, ప్రత్యేక అతిథిగా విశ్వ విద్యాలయ పరీక్ష విభాగ అధికారి రంజన్ కుమార్ ప్రధాన్, పీజీ కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత కుమార్ పాత్రో, ప్రొఫెషర్ జచిన్ కుమార్ నాయిక్‌లు పాల్గొని ప్రసంగించారు.



చర్చావేదికపై విశ్వవిద్యాలయ కులపతి తదితరులు

29 కేజీల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు

రాయగడ: గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని జిల్లాలోని మునిగుడ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి 29.540 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం ఎప్పటిలాగే పోలీసులు టికరపాడ గ్యాస్ గొడౌన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో మునిగుడ వైపు వస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో గంజాయి బస్తాలు పట్టుబడ్డాయి. దీనికి సంబంధించి కొంద్‌మాల్ జిల్లా బలిగుడ పోలీస్ స్టేషన్ పరిధిలో గల బటాగుడ గ్రామానికి చెందిన మిలన్ కుమార్ నాయక్, మధ్య ప్రదేశ్‌కు చెందిన మఖన్ కుహోరాను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు ఎస్‌డీపీఓ సంతోషిణి ఈ మేరకు బృందాన్ని ఏర్పాటు చేశారు. వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు.



గంజాయి, పట్టుబడిన నిందితులను ప్రదర్శిస్తున్న పోలీసులు

అగ్ని గంగమ్మ ఘట జాతర ప్రారంభం



గంగమ్మ అమ్మవారి ఘటాలకు దీప ధూప నైవేద్యాలతో పూజిస్తున్న భక్తులు

జయపురం: జయపురం డెప్పుగుడలో అగ్ని గంగమ్మ ఘట జాత్ర బుధవారం ప్రారంభమైంది. వీధుల్లో ప్రతి ఇంటిముందు అమ్మవారికి పూజలు చేసేందుకు ఇంటి ముందు ముగ్గులు వేసి ఫల పుష్పాలతో అమ్మవారిని స్వాగతించారు. రానున్న బుధవారం వరకు పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు.

ఖాళీ బిందెలతో నిరసన..



గండాహతిలో ఆందోళన చేస్తున్న మహిళలు



కిలోమీటర్ల దూరంలో ఉన్న జలపాతం నుంచి తాగునీటిని తీసుకువస్తున్న గండాహతి మహిళలు

- గండాహతి – ఒడాసింగి రోడ్డుపై మహిళల రాస్తారోకో
- తాగునీరు అందజేయాలని ఆందోళన

పర్లాకిమిడి: ఒకవైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు రాయఘడ బ్లాక్ గండాహతిలో జలాశయాలు, ఊటపాయలు, మహేంద్రతనయ నదిలో నీరు అడుగంటింది. దీంతో గురువారం ఉదయం 6 గంటల నుంచి గండాహతి కించిలింగి, గండాహతి– ఒడాసింగి రోడ్డుపై మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చెపట్టారు. గత రెండు రోజులుగా గండాహతి చుట్టు పక్కల గ్రామాల్లో తాగునీటికి అవస్థలు పడుతున్నారు. దీనిపై మహిళలు ఆగ్రహం ఆందోళన చేపట్టారు. మహేంద్ర తనయ నదిలో నీరు అంతరించిపోవడంతో వసుదా పథకం కింద గ్రామీణ తాగునీటి పథకం ద్వారా మంచినీటిని అందించలేకపోయాయి. ప్రభుత్వ అధికారులు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అందిస్తామని హామీ ఇచ్చిన వరకు ఆందోళన విరమించేది లేదని మహిళలు తెలిపారు.

రాజమౌళి బృందానికి డిప్యూటీ సీఎం ప్రశంసలు

కొరాపుట్: సినీ దర్శకుడు రాజమౌళి బృందానికి ఒడిశా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా అభినందనలు తెలిపారు. గురువారం తన ఎక్స్(ట్విట్టర్) ఖాతాలో కొరాపుట్‌లో సినిమా షూటింగ్‌లు పెరుగుతున్నాయని తెలిపారు. గతంలో పుష్ప 2 సినిమా ఒడిశాలో షూటింగ్ జరుపుకున్న విషయం గుర్తు చేశారు. ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం కూడా ఇక్కడే రూపుదిద్దుకుంటోందని అన్నారు. మహేష్‌బాబు, పృథ్వీరాజ్, ప్రియాంక చోప్రా వంటి సూపర్‌స్టార్లు ఇక్కడకు రావడం ఆనందకరమని అన్నారు. ఈ చిత్ర నిర్మాణం ద్వారా ఒడిశా టూరిజంకు ఊపిరి వచ్చిందని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి సదుపాయాలతో అన్ని సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు.



తుల మాలి పర్వతం పై నిర్మితమైన సినీ నగరం

కృత్రిమ నగరం..


రాజమౌళి సినిమా షూటింగ్‌తో కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి దేవమాలి పర్వం ఓ కృత్రిమ నగరంగా మారింది. రాత్రింబవళ్లు వాహనాలు వచ్చి పోతున్నాయి. దేశవిదేశాలకు చెందిన సినీ నిపుణులు వస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం బాగా ప్రాచుర్యం పొందింది.



సాలూరుకు 45 కిలోమీటర్ల దూరంలో..

చిత్ర షూటింగ్ జరుగుతున్న ప్రాంతం ఆంధ్రాలోని విజయనగరం జిల్లా సాలూరుకు 45 కిలోమీటర్ల దూరంలో ఉంది. షూటింగ్ చూసేందుకు జనం ఆసక్తి చూపిస్తున్నా గోప్యత దృష్ట్యా ఎవరినీ అనుమతించడం లేదు. మరోవైపు ప్రియాంక చోప్రా దండకారణ్య అందాలను ఆస్వాదిస్తున్నారు.





విమానం నుంచి దండకారణ్య అందాలు తిలకిస్తున్న ప్రియాంక చోప్రా



షూటింగ్ స్పాట్



సిమిలిగుడ లో హోటల్ నుంచి బయటకు వస్తున్న ప్రియాంక చోప్రా

క్లుప్తంగా

హాల్‌టికెట్ల పేరిట విద్యార్థులను వేధించొద్దు

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల హాల్ టికెట్ల జారీలో ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయన్న నెపంతో జిల్లాలో పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లలో స్కూల్ ప్రిన్సిపాల్ సంతకాలు, స్టాంపులు ఉండాల్సిందేనన్న నిబంధనలు పెట్టి విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమయంలో ఫీజుల కోసం ఒత్తిడి చేయడం సమంజసం కాదని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలు సూచనలు జరీ చేసిందని గుర్తు చేశారు. ఎక్కడైనా హాల్ టికెట్ల జారీ పేరుతో యాజమాన్యాలు గందరగోళ పరిస్థితులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

తుప్పల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


వ్యక్తి మృతదేహం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని జరజాం రోడ్డు పక్కన తుప్పల్లో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న ఎస్సై నక్క కృష్ణారావు, పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 30 ఉండవచ్చని భావిస్తున్నారు. ఇతను కొంతకాలంగా ఈ ప్రాంతంలోనే తిరిగే వాడని స్థానికులు చెబుతున్నారు. అనారోగ్యం, ఆకలి వంటి సమస్యలతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు సూచించారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు 08942-281833, 63099 90853 నంబర్లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

లారీని ఢీకొట్టిన కారు

- ఇద్దరు మహిళలకు గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన కారు

నరసన్నపేట: జమ్ము ఫ్లైఓవరు బ్రిడ్జిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలికి చెందిన పి.సునీత, పి.పద్మలకు తీవ్ర గాయాలయ్యాయి. ముందు వెళ్తున్న లారీని వెనకనుంచి కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కారు డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జయ్యింది. తాపీమేస్త్రీ పి.గణపతి కాలికి గాయం కావడంతో శ్రీకాకుళంలో చికిత్స చేసిన అనంతరం తిరిగి ఇంటికి కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. సమాచారం తెలుసుకున్న ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఫీడర్ అంబులెన్సులో ప్రసవం


బిడ్డతో సునీత బెహరా

కంచిలి: మండలంలోని కుంబరినౌగాం గ్రామానికి చెందిన సునీత బెహరా అనే గర్భిణికి గురువారం మధ్యాహ్నం పురిటి నొప్పులు వచ్చాయి. సమాచారం అందుకున్న ఎం.ఎస్.పల్లి పీహెచ్‌సి ఫీడర్ అంబులెన్స్ ఈఎంటీ అజయ్ వెంటనే గ్రామానికి వెళ్లారు. ఫీడర్ అంబులెన్సులో సునీతను తీసుకొస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో మార్గమధ్యలోనే ప్రసవం చేయించడంతో మగబిడ్డ జన్మించాడు. అనంతరం తల్లీబిడ్డలను ఆస్పత్రికి తరలించారు. సమయస్ఫూర్తితో స్పందించిన ఈఎంటీ అజయ్‌ను గ్రామస్తులు అభినందించారు.

మానవ అక్రమ రవాణా నిరోధించాలి


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని న్యాయసేవా సదన్‌లో పోక్సో చట్టం, వెట్టి చాకిరి నిర్మూలన, మానవ అక్రమ రవాణా నిషేధ చట్టంపై స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, మున్సిపల్ కమిషనర్ పి.వి.ఆర్.పి.ప్రసాదరావు, డిప్యూటీ లేబర్ కమిషనర్ కె.అజయ్ కార్తికేయ, డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్ రెడ్డి, బాలల సంక్షేమ అధికారులు శ్రీలక్ష్మి, కె.వి.రమణ పాల్గొన్నారు.

సీఎం నివాసం ముట్టడికి విఫలయత్నం


యువజన కాంగ్రెస్ కార్యకర్తల ఊరేగింపు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్ అసభ్యకరమైన పదజాలం వాడటాన్ని కాంగ్రెస్ నిరసించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మోహన్ మాఝి నివాసం ముట్టడికి యువజన కాంగ్రెస్ విఫల యత్నం చేసింది. స్థానిక దిగువ పీఎంజీ కూడలి నుంచి ఊరేగింపుగా మ్యుమంత్రి నివాసం వైపు బయల్దేరిన ఆందోళనకారుల్ని పోలీసులు అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

ఇటీవల శాసన సభలో జరిగిన విచారకర సంఘటన సందర్భంగా ఈ నెల 11వ తేదీన కాంగ్రెస్ సభ్యుడు తారా ప్రసాద్ బాహినీపతిపై దుర్భాషలాడిన పరిస్థితితో రాష్ట్ర కాంగ్రెస్ గత రెండు రోజులుగా నిరసనలు చేపడుతోంది. ఈ నిరసన ప్రదర్శనలో భాగంగా గురు వారం ముఖ్యమంత్రి నివాసాన్ని చుట్టుముట్టేందుకు నడుం బిగించారు. సభలో దురుసు వ్యాఖ్యలకు ఆరోగ్య, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెసు కార్యకర్తలు పట్టుబట్టారు. ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని యువజన కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మహిళలపై పెరుగుతున్న హింస పరిస్థితిపై ముఖ్యమంత్రి సభలో వివరణ ప్రవేశ పెట్టాలనే నినాదంతో కాంగ్రెస్ కార్యకర్తలు ముఖ్యమంత్రి నివాసాన్ని చుట్టుముట్టేందుకు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బహినీపతి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. స్థానిక భువనేశ్వర్ క్లబ్ దగ్గర నుంచి వందలాది మంది యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ఊరేగింపును నిర్వహించి ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి ప్రయత్నం చేశారు.


పోలీసులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తల తోపులాట

జయనారాయణ మిశ్రాపై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న బినోద్ మహపాత్రో, తదితరులు

జయపురం: వందే ఉత్కళ జననీ సంగీతాన్ని అవమానపరచిన సంబల్‌పూర్ జిల్లా జయనారాయణ మిశ్రాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఒడిశా ఉత్కళ సమ్మిళినీ కొరాపుట్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. గురువారం స్థానిక యాదవ భవనంలో ఉత్కళ సమ్మిళినీ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది మదనమోహన్ నాయక్ అధ్యక్షతన అత్యవసర సమావేశంలో ముఖ్య అతిథిగా బినోద్ మహపాత్రో హాజరయ్యారు. జయనారాయణ మిశ్రా ఉత్కళ జాతి గీతాన్ని, ప్రజలను అవమానపరచారన్నారు. ఒడిశా ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. ప్రభుత్వం అతనిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొరాపుట్ జిల్లా కార్యదర్శి నవీన మదల ఆదేశం మేరకు నిర్వహించిన అత్యవసర సమావేశంలో రాష్ట్ర సభ్యులు బాలారాయ్, జిల్లా సభ్యులు సురేంద్ర రథ్, డాక్టర్ ప్రమోదిని హోత్త తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత ఒడిశాను నిర్మిద్దాం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రదీప్ ప్రదాన్, బిబూప్రసాద్ సాహు, తదితరులు

- సమాచార హక్కు చట్టంపై అవగాహన

పర్లాకిమిడి: ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం అమలు చేయడం లేదని, ఇందులోని కొన్ని కార్యాలయాలకు ప్రభుత్వమే వ్యక్తిగత సమాచార హక్కు నుంచి మినహాయింపులు ఇచ్చిందని ఒడిశా సూచనా అధికార్ అభియాన్ అధ్యక్షుడర, న్యాయవాది ప్రదీప్ ప్రదాన్ అన్నారు. స్థానిక బృందావన్ ప్యాలస్‌లో గురువారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది బిబు ప్రసాద్ సాహు, కృష్ణచంద్ర పాత్రో, రాజేశ్వరీ దొళాయి, హైకోర్టు లాయర్ బినోద్ పాణిగ్రాహి, ఐడబ్ల్యూఏ కార్యదర్శి శశిభూషన్ రాజు, జస్టీస్ కార్నర్ కార్యదర్శి భాగ్యలక్ష్మి నాయక్ హాజరయ్యారు. అవినీతి రహిత ఒడిశా నిర్మాణానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కుపై దరఖాస్తు పెంచకుంటే సమీప భవిష్యత్‌లో ఈ చట్టం రద్దయ్యే అవకాశం ఉందని న్యాయవాది బిబుప్రసాద్ సాహు అన్నారు. ఒడిశాలోని అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది కొరత చూపి సమాచార హక్కు కింద ఫైల్ చేస్తే జవాబు ఇవ్వడం లేదని జస్టీస్ కార్నర్ అధ్యక్షురాలు, న్యాయవాది భాగ్యలక్ష్మి నాయక్ అన్నారు. ఆర్‌టీఐ అమలులో ప్రభుత్వ అధికారులు సరైన వ్యవస్థలు లేవని, సమాచారం అడిగినప్పుడు జెరాక్స్‌కు డబ్బులు కట్టమంటున్నారని పలువురు న్యాయవాదులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. న్యాయవాది ముల్లి గోపాలరావు, సీసీడీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి అడ్డాల జగన్నాథ రాజు, జస్టీస్ కార్నర్ కో ఆర్డినేటర్ సంజయ్ రౌత్ పాల్గొన్నారు.


కార్యక్రమానికి విచ్చేసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు

కిడ్నీ సమస్యతో యువకుడి మృతి

- కిడ్నీ దినోత్సవం నాడు విషాదం


భాస్కర్(ఫైల్)

టెక్కలి రూరల్: ప్రపంచ కిడ్నీ దినోత్సవం నాడే టెక్కలిలో డయాలసిస్ సేవలు పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. శ్రీనివాస నగర్‌కు చెందిన ఎస్.భాస్కర్(30) కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. గురువారం తీవ్ర అస్వస్థత రావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ కేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అత్యవసర విభాగానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భాస్కర్ మృతి చెందాడు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం నాడు కిడ్నీ వ్యాధితో యువకుడు మృతి చెందడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక ర్యాంపులో తనిఖీలు


పురుషోత్తపురం ఇసుక ర్యాంపులో తనిఖీలు చేస్తున్న మైన్స్ అధికారులు

సరుబుజ్జిలి: పురుషోత్తపురం 1, 2 ఇసుక ర్యాంపుల్లో టెక్కలి గనుల శాఖ ఏడీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌కు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గం ఇన్‌చార్జి చింతాడ రవి కుమార్ ఇసుక ర్యాంపుపై ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలు మేరకు టెక్కలి గనుల శాఖ అధికారులు ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేపట్టారు. ఇసుక ర్యాంపు నిర్వహణ ఎంత విస్తీర్ణం మేరకు నిర్వహించారు, తవ్వకాలు ఎంత లోతులో చేపడుతున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ర్యాంపు తీరం వరకు మైన్స్ అధికారులు బొలేరో వాహనం ద్వారా వెళ్లి తనిఖీ చేశారు. ర్యాంపులో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాంపులో సీసీ కెమెరాలు ఉండాలని, ఇసుక రవాణా చేస్తున్న ప్రతి వాహనానికి బ్యానర్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. తవ్వకాలు జరిగే ప్రదేశం వద్దకు వెళ్లకుండా అక్కడ ఉన్న కొంతమంది వద్ద నుంచి వివరాలు సేకరించి వెనుదిరిగారు. మైన్స్ అధికారులు ర్యాంపు వద్దకు తనిఖీలు కోసం వచ్చే సమయంలో మండల స్థాయి అధికారులు ఎవ్వరూ లేకపోవడం గమనించదగ్గ విషయం.

మద్యం లోడ్‌తో వ్యాన్ బోల్తా


రోడ్డుపై పడిన మద్యం బాటిళ్లు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొతిగుడ వద్ద మద్యం లోడుతో వస్తున్న వ్యాన్ బోల్తాపడింది. రాయగడ సమీపంలో గల దేవదొల వద్ద డిపో నుంచి మద్యం లోడుతో బిసంకటక్ మీదుగా కలహండి జిల్లా జయపట్నాకు వెళ్తున్న సమయంలో బిసంకటక్ సమీపంలోని గొతిగుడ వద్ద వ్యాన్ టైర్ పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వ్యాన్‌లోని మద్యం బాటిళ్లు రోడ్డుపై పడిపోయాయి. వ్యాన్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇదే అదనుగా భావించిన కొందరు మద్యం బాటిళ్లను తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని జనాలను చెదరగొట్టారు.

నేడు డోలోత్సవం


దేవతామూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

జయపురం: ఈ నెల 14న డోలాపూర్ణిమ పురస్కరించుకుని జయపురంలో డోలా జాతర నిర్వహించనున్నారు. బుధవారం రాత్రి పట్టణంలో మదన మోహనుడు, వల్లబనారాయణుడు, కుంజబిహారీ, రాధాకృష్ణ తీరువీధి నిర్వహించారు. పట్టణంలోని రాధాకృష్ణ, జగన్నాథ మందిరాల్లో డోలాపూర్ణిమ వేడుకలు ఘనంగా జరుగుతాయి. మదలా సాహిలో కుంజబిహారి, జగన్నాథ మందిరం నుంచి జగన్నాథుడు, నారాయణ మందిరం నుంచి మదన మోహనుడు, చైతన్య మందిరం నుంచి రాధాకృష్ణులు రఘునాథ్ మందిరం చేరుకుని అక్కడ నుంచి ఊరేగింపు చేస్తారు. డోలాపూర్ణిమ రోజు బంకమటం వద్ద దేవతా మూర్తులకు పూజలు చేసి హోళపాడ కాల్చుతారు.

ఒడిశా జ్యుడీషియల్ సర్వీసెస్ ఫలితాలు విడుదల

భువనేశ్వర్ : ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్‌సీ) సివిల్ జడ్జిల పోస్టుల కోసం నిర్వహించిన ఒడిశా జ్యుడీషియల్ సర్వీసెస్ – 2023 పరీక్ష ఫలితాలను ప్రకటించింది. ఈ ఫలితాల్లో 33 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో అత్యధికంగా 24 మంది మహిళలు ఉండడం విశేషం. ఈ ఫలితాల్లో సోమేష్ రాణా బిజులి అగ్రస్థానంలో నిలిచారు. తదుపరి 2 స్థానాల్లో అరుణిమా పతి, పాయెల్ అట్టా నిలిచారు. ఈ పోటీ పరీక్షలో మహిళలు అసాధారణ ప్రతిభను ప్రదర్శించారు. తొలి పది ఉత్తమ ఉత్తీర్ణుల జాబితాలో 8 మంది మహిళ అభ్యర్థులు ఉండడం విశేషం. ఎంపిక ప్రక్రియ యొక్క చివరి దశలో హాజరైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ opr-c.-g-o-v.in (ఓపీఎస్‌సీ.గొ.ఇన్) నుంచి తుది ఫలితాల్ని పొందవచ్చు.

శ్రీ మందిరం ఉత్తర ద్వారం వెలుపల 'అన్న క్షేత్ర'


శ్రీ మందిరం ప్రాకారం పథకం పరిశీలనలో పూరీ గజపతి మహా రాజాతో సీఏఓ

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరం ప్రాకారం పథకం పనులను పూరీ గజపతి మహా రాజా దివ్య సింగ్ దేవ్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ క్షేత్రం జగన్నాథ స్వామి ప్రధాన దేవస్థానం శ్రీ మందిరం ఉత్తర ద్వారం వెలుపల అన్న క్షేత్రం స్థాపించే ప్రతిపాదన ఉందని తెలిపారు. పెరుగుతున్న భక్తుల సంఖ్యతో ఆనంద్ బజార్ ప్రాంగణం కిక్కిరిసి పోతుంది. ఈ సమస్యను పరిష్కరించడానికి అన్న క్షేత్రం ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శ్రీ మందిరం ఉత్తర ద్వారం వెలుపల ఒక ప్రత్యేక స్థలాన్ని గుర్తించామని మహా రాజా వివరించారు.

హోలీ పండుగను జరుపుకుంటున్న సరస్వతీ శిశు విద్యామందిర్ విద్యార్థినులు



ఘనంగా హోలీ

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో గురువారం హోలీ వేడుకలు ఆనందంగా జరుపుకున్నారు. విద్యాలయాలకు సెలవు ప్రకటించడంతో శిశుమందిర్‌లో గురుజీ, గురుమాతలు గురువారమే రంగులు జల్లి పండుగను జరుపుకున్నారు.

సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో చిన్నారులు




హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తున్న విద్యార్థినులు

రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్


లోక్ సేవా భవన్‌లో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఆరోగ్య యోజన పథకాల అమలు సమావేశం

భువనేశ్వర్: రాష్ట్రంలో గోపబంధు జన ఆరోగ్య యోజన (జీ–జేఏవై)తో భారత ప్రభుత్వ పథకం ఆయుష్మాన్ భారత్ – ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం–జేఏవై) త్వరలో అమలు అవుతుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటించారు. ఈ పథకాల కింద 1 కోటి 03 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాలతో ఉత్కళ దివస్ పురస్కరించుకుని ఏప్రిల్ నెల 1న ఆయుష్మాన్ వయోబంధన యోజన ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వారికి ప్రయోజనం కల్పిస్తారని వివరించారు.

పీఎం–జేఏవై, జీ–జేఏవై అమలుపై లోక్ సేవా భవన్‌లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు.

రెండేళ్లలో 1,859 పాము కాటు మరణాలు: మంత్రి

భువనేశ్వర్: రాష్ట్రంలో పలు చోట్ల గత రెండేళ్లలో మొత్తం 1,859 మంది పాముకాటు కారణంగా మరణించారని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి గురువారం రాష్ట్ర శాసన సభలో వెల్లడించారు. బిజూ జనతా దళ్ బొస్తా నియోజక వర్గం ఎమ్మెల్యే సుబాషిని జెనా అడిగిన ప్రశ్నకు మంత్రి సురేష్ పూజారి లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. వీరిలో 1,022 మంది బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించారు. ధ్రువీకరణ తర్వాత 22 మంది ప్రభావిత వ్యక్తుల అభ్యర్థనల్ని తిరస్కరించారు. మరో 106 కేసులు వివిధ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి విశ్లేషించారు. అదే విధంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో 709 పాము కాటు మరణాలు నమోదయ్యాయి. వీటిలో 435 మంది మరణించిన వ్యక్తుల కుటుంబాలకు పరిహారం మంజూరు చేశారు.

8 కేసులు తిరస్కరించారు. అనుబంధ పత్రాలు లేకపోవడం వల్ల తహశీల్దార్, సబ్-కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో 266 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) మార్గదర్శకాల ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం విపత్తు సహాయ చెల్లింపు, పర్యవేక్షణ వ్యవస్థలు (డీఏఎంపీఎస్) పోర్టల్ ద్వారా మృతుల బంధువులకు రూ.4 లక్షల పరిహారాన్ని అందిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

దగ్గరకొచ్చారో దూకేస్తా..!

- రిమ్స్‌లో మద్యం మత్తులో రోగి ఆత్మహత్యాయత్నం
- భవనం పైనుంచి దూకేందుకు ప్రయత్నం
- కాపాడిన సెక్యూరిటీ సిబ్బంది, కార్మికులు


బాధితుడిని పట్టుకుంటున్న సిబ్బంది (ఇన్‌సెట్లో) దూకేస్తానంటూ బెదిరిస్తున్న వరహా నర్సింహం

శ్రీకాకుళం: మద్యం తాగేందుకు డబ్బుల కోసం ఫోన్ చేస్తే కుటుంబ సభ్యులు లిఫ్ట్ చేయకపోవడంతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రిమ్స్ ఆస్పత్రి భవనం మూడో అంతస్తు పైనుంచి దూకేందుకు ప్రయత్నించాడు. అయితే సకాలంలో ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది గమనించి కాపాడారు. రిమ్స్ సిబ్బంది, రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సరుబుజ్జిలి మండలం నక్కలపేట గ్రామానికి చెందిన సనపల వరహా నర్సింహం అనే వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. మద్యం మాన్పించేందుకు కుటుంబ సభ్యులు రిమ్స్‌లో చేర్పించారు. అక్కడి ఎస్ఎం వార్డులో ఉండి చికిత్స పొందుతున్నాడు. గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో భవనంలోని మూడో అంతస్థుకు చేరిన వరహానర్సింహం ప్రహరీ గోడపై కూర్చున్నాడు. అతన్ని వారించగా కిందకి దూకే ప్రయత్నం చేయబోయాడు. సెక్యూరిటీ సిబ్బంది, అక్కడే పనిచేస్తున్న తాపీమేస్త్రీలు, కార్మికులు చాకచక్యంగా పట్టుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. సిబ్బంది పట్టుకుని పైకి తీసే క్రమంలో సుమారు 20 నిమిషాల పాటు ఆ వ్యక్తి గాలిలోనే వేలాడుతూ ఉన్నాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు, వైద్యులు, స్థానికులు చెబుతున్నారు. మద్యం తాగేందుకు తన వద్ద డబ్బులు లేవని కుటుంబ సభ్యులకు ఫోన్ చేస్తే వారు ఫోన్ లిఫ్ట్ చేయకపోవటం వల్లే తాను ఆత్మహత్యకు ప్రయత్నించానని రిమ్స్ అధికారులకు చెప్పాడు. కాగా, వరహా నర్సింహం ఇన్‌పేషెంట్ కాదని ఆస్పత్రి సూపరెండెంట్ డాక్టర్ షకీల చెపుతుండగా.. ఎస్ఎం వార్డులో చికిత్స పొందుతున్నారని రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా


సిబ్బందికి సూచనలిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

ఇచ్ఛాపురం: ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని చెక్‌పోస్టుల వద్ద నిషేధిత పదార్థాలైన గంజాయి, సారా, మద్యం అక్రమ రవాణ జరగకుండా నిరంతరం నిఘా పెట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. పురుషోత్తపురం చెక్‌పోస్టు, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సారా అమ్మకాల కట్టడికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం-2, అక్రమ మద్యం 14405 టోల్ ఫ్రీ నంబర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మందు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొహిబిష న్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి సీహెచ్ తిరుపతి, సీఐ పి.డి.ప్రసాద్, పెట్రోలింగ్ ఎస్సై జి.బి.రమణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సురక్షితంగా డ్రైవింగ్ చేయాలి

• కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



శిక్షణ పొందిన డ్రైవర్లతో కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: డ్రైవింగ్ నేర్చుకున్న వారంతా సురక్షితంగా డ్రైవింగ్ చేయాలని అలాగే రహదారి భద్రత కోసం అమలులో ఉన్న నియమాలను పాటించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ సూచించారు. జీఎంఆర్ సంస్థ సీఎస్ఆర్ కింద భోగాపురం మండలం గూడెపువలస, ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన యువతకు లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో నెల రోజుల పాటు 50 మంది యువకులకు శిక్షణ ఇచ్చింది. ఈ శిక్షణ పొందిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా గురువారం ఆయన చాంబర్‌లో సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, ఏఎల్‌డీఎం వైడీ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధించిన పశువులను కాపాడిన పోలీసులు



అక్రమంగా నిర్బంధించిన పశువులు

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామం శివారు మామిడి తోటలో అక్రమంగా నిర్బంధించిన 171 పశువులను సీఐ సీహెచ్.షణ్ముఖరావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం కాపాడారు. ఆ పశువులను ఇక్కడికి తీసుకొచ్చి వధించి వేరే చోటకు మాంసాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉన్నాయని అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పశువులను అక్రమంగా నిర్బంధించిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆ పశువులను ప్రస్తుతానికి అక్కడే ఉంచామని కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి


• మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు స్రవంతి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్రవంతి తదితరులు

విజయనగరం గంటస్తంభం: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 19న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.స్రవంతి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆమె పట్టణంలోని పలు పాఠశాలల్లో ఉన్న మధ్యాహ్న భోజన పథక కార్మికులకు కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడుతూ కేవలం సేవా దృక్పథంతో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులు ఎన్ని ప్రభుత్వాలు మారినా నేటికీ అన్యాయానికి గురవుతున్నారన్నారు. ఈనెల 19 జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన పథక కార్మికులంతా హాజరవాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కె.రాజి పాల్గొన్నారు

విజయీభవ



పులివెందులలో కబడ్డీ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్‌జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు విజేతలుగా తిరిగి రావాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీ.ప్రభావతి ఆకాంక్షించారు. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లా పులివెందులలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు గురువారం పయనమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జట్టులోకి అర్హత సాధించిన క్రీడాకారులకు ఆమె పలు సూచనలు చేశారు. కృషి, పట్టుదల, నిరంతర శిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా రాణించగల సామర్థ్యం దక్కించుకోవచ్చని చెప్పా రు. విజయనగరం జిల్లా కబడ్డీ, ఖోఖో క్రీడల కు పెట్టింది పేరుగా ఖ్యాతినర్జించిందని, అదే తరహాలో సబ్‌జూనియర్స్ పోటీల్లో వర్ధమాన క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వెబ్ ఆప్షన్

విజయనగరం టౌన్: డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వెబ్ ఆప్షన్ సర్వీస్‌ను జ్ఞానభూమి, ఎమ్‌డీఎఫ్‌సీ డాట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్. డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు జిల్లా షెడ్యూల్ కులముల సంక్షేమం, సాధికారత అధికారి బి.రామానందం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోపు వారి లాగిన్‌లో కోచింగ్ సెంటర్ పేరు, ప్రాధాన్యత వారీగా వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలన్నారు.



ఎక్కువమందికి నిద్రలేమి సమస్య

ఓఎస్‌ఏ మిషన్ పెట్టుకుని నిద్రపోతున్న గురక సమస్య ఉన్న వ్యక్తి



చాలామంది నిద్రలేమి **సమస్య బారి**న పడుతున్నారు. **అయితే** ఈసమస్యకు **ఎవరిని** సంప్రదించాలో **చాలామందికి తెలి**యదు. పలమనాలజిస్టునుగాని, ఈఎన్‌టీ వైద్యుడిని గానీ సంప్రదించాలి. ఆరోగ్యంగా జీవించడం కోసం రోజులో 6 నుంచి 7 గంటల పాటు నిద్రపోవాలి. సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించకూడదు. అదేవిధంగా టీవీ కూడా గంటల తరబడి చూడకూడదు.

డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

నిద్ర కరువైతే అనారోగ్యం..!

- పెరుగుతున్న నిద్రలేమి సమస్య
- నిద్రలేమితో బీపీ, సుగర్, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ఆస్కారం
- మొబైల్, టీవీలు అతిగా చూడడం వల్ల సమస్య

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవనశైలిలో మార్పులు, అధికంగా మొబైల్ వాడడం, టీవీ ఎక్కువగా చూడడం వల్ల అధికశాతం మంది నిద్రలేమి బారిన పడుతున్నారు. ఎక్కువసేపు ఒకే చోట కూర్చుని పనిచేయడం, జంక్‌ఫుడ్స్ ఎక్కువగా తినడం, రాత్రివేళ ఆలస్యంగా నిద్రపోవడం, రాత్రి షిఫ్టుల్లో విధులు నిర్వహించడం వల్ల తగినంత నిద్ర ఉండదు. దీని వల్ల వారు బీపీ, సుగర్, ఊబకాయం, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, థైరాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. శుక్రవారం ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. చాలా మంది నిద్ర లేకపోతే ఏం జరుగుతుంది? అని తేలికగా తీసుకుంటారు. అర్ధరాత్రి వరకు చాలా మంది నిద్రపోరు. దీని వల్ల



నిద్రలేమి సమస్య ఉన్న వ్యక్తిని పరీక్షిస్తున్న వైద్యుడు

అనేక సమస్యల బారిన పడతారు. నిద్రలేమి వల్ల ఓఎస్‌ఏ (అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా) అనే సమస్యకు గురవుతారు. ఈ సమస్య ఉన్న వ్యక్తి శ్వాస తీసుకోవడం పదేపదే ఆగిపోవడం, ఊపిరి లోతుగా తీసుకోవడం (అల్పశ్వాస) జరుగుతుంది. అదే విధంగా పెద్దగా గురక పెట్టడం, శ్వాస పునఃప్రారంభం అయినప్పుడు ఉక్కిరిబిక్కిరి అయి వింత శబ్దాలు రావడం, పగటి సమయంలో మధ్యమధ్య కునుకుపాట్లు పడుతూ ఉండడం, అలసటగాను, మత్తుగాను ఉంటుంది. మద్యం తాగడం, పొగతాగడం, స్థూలకాయం వల్ల ఓఎస్‌ఏ సమస్య తీవ్రతరం అవుతుంది. చిన్నపిల్లల్లో అయితే ఎదుగుదల ఉండదు. మానసిక సమస్యల బారిన పడతారు.నెలకు 1000 మంది వరకు నిద్ర లేమి సమస్య బారిన పడుతున్నారు.

6నుంచి 7 గంటల నిద్ర అవసరం

ప్రతి వ్యక్తి రోజులో 6 నుంచి 7 గంటలు నిద్రపోవాలి. ఇలా నిద్ర పోవడం వల్ల హార్మోన్స్ తయారవుతాయి. ఒత్తిడి తగ్గుతుంది. పనిచేయడానికి అవసరమైన శక్తి తయారవుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది.

జాగ్రత్తలు

నిద్రలేమి సమస్య బారిన పడకుండా ఉండాలంటే ప్రతిరోజూ వ్యాయమం చేయాలి. కనీసం రోజులో 6 గంటలు నిద్ర పోవాలి. నిద్రలేమి సమస్య ఉన్నట్లయితే పలమనాలజిస్టునుగాని, ఈఎన్‌టీ వైద్యుడిని గాని సంప్రదించాలి. ఊబకాయం రాకుండా చూసుకోవాలి. పానీపూరీ, చాట్, పిజ్జా, బర్గర్లు వంటివి ఎక్కువగా తినకూడదు.

ఆకతాయిల ఆట కట్టించేందుకు ‘శక్తి’ టీమ్స్

- ఐదు బృందాలుగా 30మందితో టీమ్స్
- ఒక్కో బృందానికి ఒక్కో ఎస్సై నాయకత్వం
- టీమ్స్ పనితీరు చూసేందుకు అదనపు ఎస్పీ నియామకం



శక్తి టీమ్స్‌కు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: ఆకతాయిల ఆట కట్టించేందుకు ‘శక్తి ’ టీమ్స్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ‘శక్తి’ యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు శక్తి టీమ్స్‌ను నియమించామని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్‌తో ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం మమేకమై, వారు నిర్వర్తించే విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, ముఖ్య కూడళ్లను మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడతారన్నారు. విజయనగరం, బొబ్బిలి, రాజాంలలో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు బృందాలుగా 30మందితో శక్తి టీమ్స్ ఏర్పాటు చేశామని, ఒక్కో బృందానికి ఒక్కో ఎస్సై నాయకత్వం వహిస్తారని చెప్పారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్ కోసం గతంలో ప్రత్యేకంగా కేటాయించిన ద్విచక్రవాహనాలను, ఫోర్ వీలర్స్ పెట్రోలింగ్ వాహనాలను వినియోగించాలని సూచించారు. ఆపద సమయంలో శక్తి యాప్‌కు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 112,100 కాల్స్‌ను బట్టి సంఘటన స్థలంకు వెళ్లే వారు తమతోపాటు ట్యాబ్‌లు కూడా వెంట తీసుకుని వెళ్లాలని, బాడీ వోర్న్ కెమెరాలను ధరించాలని సూచించారు. కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ శక్తి టీమ్స్‌ను ఆదేశించారు.

ప్రజల్లో అవగాహన కల్పించాలి

మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి, వారి మొబైల్స్‌లో యాప్ నిక్షిప్తం చేయడం, రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని మహిళలకు వివరించాలని కోరారు. ఈ బృందాల పని తీరును జిల్లాలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత పర్యవేక్షిస్తారని, మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ నోడల్ అధికారిగా ఉంటారన్నారు. అంతేకాకుండా, శక్తి టీమ్స్ పని తీరును రాష్ట్ర డీజీపీ కార్యాలయం కూడా పర్యవేక్షిస్తుందని, వారి ఆదేశాల మేరకు చేయాల్సి ఉంటుందని శక్తిటీమ్స్‌కు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, మహిళా పీఎస్ సీఐ ఈ.నర్సింహమూర్తి, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, శక్తి టీమ్స్ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఉంగుటూరు: చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై ఆత్కూరు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా ఇప్పలవలస గ్రామానికి చెందిన జామి శ్రీనివాసరావు(60) ఆత్కూరులోని మేనల్లుడి కుమార్తె ఓణీల ఫంక్షన్‌కు వచ్చాడు. స్వగ్రామానికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతున్న సమయంలో గన్నవరం వైపు నుంచి వస్తున్న ఇన్నోవా కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ఏఎస్ఐ రామారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో నూతన నియామకాలు

- జాబితాను విడుదల చేసిన పార్టీ కేంద్ర కార్యాలయం

విజయనగరం: పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నూతన నియామకాలు చేపట్టింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ/ మండల పార్టీ అధ్యక్షులను నియమించారు. నూతనంగా నియామకమైన వారి జాబితాను గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. నియోజకవర్గాల వారీగా పార్టీ మండల, మున్సిపాలిటీ అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి..

గజపతినగరం నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
బొండపల్లి	బొద్దల చిన్నంనాయుడు
దత్తిరాజేరు	రాపాక కృష్ణమూర్తి
గజపతినగరం	బూడి వెంకటరావు
గంట్యాడ	జాగారపు అప్పారావు
జామి	గొర్లె రవికుమార్
నెల్లిమర్ల నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
నెల్లిమర్ల నగర పంచాయతీ	చిక్కాల సాంబశివరావు
నెల్లిమర్ల	గదల సన్యాసినాయుడు
పూసపాటిరేగ	పతివాడ అప్పలనాయుడు
భోగాపురం	ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి
డెంకాడ	పిన్నింటి తమ్మునాయుడు
రాజాం నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
రాజాం మున్సిపాలిటీ	పాలవలస శ్రీనివాసరావు
రాజాం	లావేటి రాజగోపాలనాయుడు
రేగిడి ఆముదాలవలస	వావిలాపల్లి జగన్‌మోహన్‌రావు
సంతకవిటి	గరుగుబిల్లి స్వామినాయుడు
వంగర	కరణం సుదర్శనరావు

ఎస్‌కోట నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
కొత్తవలస	ఒబ్బిన నాయుడు
ఎల్‌కోట	గుమ్మిడి సత్యనారాయణ
ఎస్‌కోట	మోపాడ డీబీఎస్‌కే కుమార్
వేపాడ	మమ్ములూరి జగన్నాథం
చీపురుపల్లి నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
చీపురుపల్లి	మీసాల వరహాలనాయుడు
గరివిడి	మీసాల విశ్వేశ్వరరావు
మెరకముడిదాం	కోట్ల వెంకటరావు
గుర్ల	పొట్నూరు సన్యాసినాయుడు
బొబ్బిలి నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
బొబ్బిలి మున్సిపాలిటీ	చోడగంజి రమేష్‌నాయుడు
బొబ్బిలి	తమ్మిరెడ్డి దామోదరరావు
తెర్లాం	తెంటు సత్యంనాయుడు
రామభద్రాపురం	అప్పికొండ లక్ష్మునాయుడు
బాడంగి	వేమల శివ ప్రసాదరావు
సాలూరు నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
మెంటాడ	రాయిపల్లి రామారావు

బడిబయట బడిఈడు పిల్లలు

- భిక్షాటన చేస్తూ జీవనయానం
- తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులే కారణం
- పట్టించుకోని సంబంధిత అధికారులు





రామభద్రపురం: తల్లితో పాటు భిక్షాటన చేస్తున్న బాలుడు,(ఇన్‌సెట్లో) చొక్కాపు వీధిలో భిక్షాటన చేస్తున్న బాలుడు

రామభద్రపురం: ఏ దేవుడు ఈ చిన్నారుల మొర ఆలకిస్తాడు? ఏ అధికారి వీరి దీనస్థితిని పట్టించుకుంటాడు? ఏ నాయకుడు ఈ పిల్లలకు అండగా ఉంటాడు? ఇంటి ఆర్థిక పరిస్థితులు సహకరించక.. ఆటపాటలతో మమేకమవుతూ విద్యను అభ్యసించవలసిన వయసులో ఎందరో బడిఈడు పిల్లలు బడి బయట భిక్షాటన చేస్తున్నారు. అలాగే వీధి పిల్లలుగా, బాలకార్మికులుగా మారుతుండడం దురదృష్టకరం. బడిఈడు పిల్లలు బడికి వెళ్లకుండా వీధులలో, ఆలయాల వద్ద భిక్షాటన చేస్తూ కనబడడంతో ప్రభుత్వ పరిరక్షణ ఇంత దీనస్థితితో ఉందా అంటూ పలువురు విమర్శిస్తున్నారు.బాలల పరిరక్షణ గురించి ప్రభుత్వంతో పాటు సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని కుటుంబాలలో ఆర్థిక, సామాజిక పరిస్థితుల కారణంగా కొంతమంది తల్లిదండ్రులే తమ పిల్లల్ని బలవంతంగా బడిమాన్పించి, భిక్షాటన చేయించడం, ఇంటి పనికో, దుకాణాలకో, మెకానిక్ షెడ్లులకో లేదంటే వ్యవసాయపనులకో పంపిస్తూ బాలకార్మికులుగా మారుస్తున్నారు. ఈ పద్ధతిని మార్చి పిల్లలంతా బడికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, బాలల పరిరక్షణ కమిటీ తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోకుండా విద్యాహక్కు చట్టానికి విఘాతం కలిగిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉంటే పలువురు చిన్నారులు బహిరంగంగా భిక్షాటన ఎందుకు చేస్తారని, బాలల పరిరక్షణ కమిటీ పర్యవేక్షణ కరువైందని పలువురు విమర్శిస్తున్నారు





రామభద్రపురం: ఆటోలో భిక్షాటనకు బయలుదేరిన బడిఈడు పిల్లలు, (ఇన్‌సెట్లో) వేషం మార్చి యాచన చేస్తున్న విద్యార్థి



రామభద్రపురం: శివాలయం వద్ద భిక్షాటన చేస్తున్న చిన్నారులు

15న ఎంఆర్ కళాశాలలో జాబ్ మేళా

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మహారాజ అటానమస్ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఈ నెల 15న ఎంఆర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జిల్లా మేనేజర్ జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీయువకులు తమ వివరాలను ‘నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఐఎన్’ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని అడ్మిట్ కార్డుతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, పాస్‌ఫొటోతో హాజరుకావాలని సూచించారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం సెల్: 80994 61303, 99888 53335 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బదిలీ కౌన్సెలింగ్‌ను మాన్యువల్‌గా నిర్వహించాలి

• పీఆర్‌టీయూ జిల్లా కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న సంఘ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాయుడు

విజయనగరం అర్బన్: వేసవి సెలవుల్లో చేపట్టబోయే ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియను ఆన్‌లైన్‌లో కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని పీఆర్‌టీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సంఘ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు మాట్లాడారు. 8 ఏళ్ల సర్వీసు నిండిన వారు బదిలీలు తప్పనిసరి చేసుకోవాల్సి ఉంటుందని, ఆన్‌లైన్ విధానం వల్ల వారికి ఇబ్బందని తెలిపారు. తప్పనిసరి బదిలీ ఉపాధ్యాయులు దాదాపు 1,500 మంది వరకు ఉన్నారని, ఆన్‌లైన్ విధానంలో ఆప్షన్స్ పెట్టుకోవడం కష్టతరమని, అన్యాయం జరిగే అవకాశాలే ఎక్కువన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రావాడ రాంబాబు, ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌చార్జి బంకపల్లి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ ఉపకరణాలు



రైతుసేవా కేంద్రంలో రైతు విశిష్ట సేవా సంఖ్య నమోదు తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు

తెర్లాం: వ్యవసాయ యాంత్రీకరణ ఉపకరణాలు అందించేందుకు జిల్లాకు రూ.2.5కోట్ల రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తెర్లాం వచ్చిన సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం 50శాతం రాయితీపై పవర్‌స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు, ట్రాక్టరు పరికరాలు రైతులకు అందించనుందని చెప్పారు. స్ప్రేయర్లకు మాత్రం కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. వీటన్నింటికి కలిపి జిల్లాకు రూ.2.5కోట్లు ప్రభుత్వం రాయితీ ప్రకటించిందని తెలిపారు. జిల్లాలోని రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు పొందేందుకు ఆయా మండలాల వ్యవసాయ అధికారుల ద్వారా దరఖాస్తులు పంపించాలన్నారు. అర్హులైన రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాకు మంజూరైన వ్యవసాయ పరికరాలను మండలాల వారీగా కేటాయింపులు చేశామని తెలిపారు. జిల్లాలోని రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగన్నపాడు రైతు సేవా కేంద్రం తనిఖీ

మండలంలోని గంగన్నపాడు గ్రామంలో గల రైతు సేవా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రం ద్వారా జరుగుతున్న రైతు విశిష్ట సేవా సంఖ్య నమోదును పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జిరాయితీ భూములు ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతు విశిష్ట సేవా సంఖ్యను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి జి.సునీల్‌కుమార్ ఉన్నారు.


చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం



స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులు నాయుడు

చీపురుపల్లి రూరల్(గరివిడి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసుల నాయుడు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘువులు అన్నారు. గరివిడిలో శ్రీ చైతన్య పాఠశాల ఆవరణంలో నిర్వహించిన డా.బీఎస్.రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యావిధానంలో ఉన్నత భవిష్యత్తుకు చదువు ఎంత అవసరమో శారీరక, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు, క్రీడల్లో ఉన్నతంగా రాణించేందుకు క్రీడలు కూడా అంతే అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కానీ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కానీ మంచి భవిష్యత్తు లక్ష్యంగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎంవీ.సురేష్, రీజనల్ ఇన్‌చార్జ్ వి.శ్రీనివాసరావు, రామినాయుడు, కోఆర్డినేటర్‌లు బాలరాజు, వెంకటరమణ, అప్పారావు, మనోరమ, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.


ట్రైబల్ పెయింటింగ్ అండ్ ఆర్ట్ కాంపిటీషన్‌లో ప్రతిభ



పోటీల్లో గెలుపొంది బహుమతులు అందుకుంటున్న గిరిజన విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: విశాఖపట్నంలో ఈనెల 12న జరిగిన జన్ జాతీయ గౌరవ దివస్ గిరిజన స్వాభిమాన్ వేడుకలు–2025లో భాగంగా నిర్వహించిన స్టేట్ లెవెల్ ట్రైబల్ పెయింటింగ్ అండ్ ఆర్ట్ కాంపిటీషన్‌లో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన యువకులు, విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ మేరకు ఈ పోటీల నిర్వహణలో పాల్గొన్న లైజనింగ్ ఆఫీసర్/డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావు గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీనియర్ విభాగంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని తాడికొండ గ్రామానికి చెందిన మండంగి బాలచంద్రుడు వేసిన ఆర్ట్ ప్రథమస్థానం పొందిందని తెలిపారు. ఈ నేపథ్యంలో బాలచంద్రుడుకు రూ.10వేల నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసాపత్రం, షీల్డ్‌ను నిర్వాహకులు అందజేశారన్నారు. అలాగే ద్వితీయ స్థానం పొందిన గుమ్మలక్ష్మీపురం మండలం టిక్కబాయి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఆరిక రాజేష్‌కు రూ.5వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం, షీల్డ్‌ను అందజేశారని, ప్రత్యేక బహుమతులను కురుపాంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు గౌతమ్, అన్విత‌లకు అందజేశారని పేర్కొన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు



సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన యువకుడితో డీఎస్పీ శ్రీనివాస రావు, వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: ఆత్మహత్యకు పాల్పడతానని సూసైడ్ నోట్ రాసిన కేరళ యువకుడు విష్ణు కొయిత్తా పత్తాయా వెస్లీ (21) ఆచూకీని విజయనగరం టౌన్ పోలీసులు కనిపెట్టి డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు సమక్షంలో యువకుడిని బంధువులకు అప్పగించారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కేరళ రాష్ట్రంలోని కన్నూరు జిల్లాకు చెందిన విష్ణు కొయిత్తా పత్తాయా వెస్లీ బీఎస్సీ నర్సింగ్ చదివి బెంగళూరులోని ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో వర్క్ చేస్తున్నాడు. ఒక యువతితో పరిచయం ఏర్పడి, ప్రేమకు దారితీసింది. ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో, యువకుడి ఫోన్ నంబర్‌ను సదరు యువతి బ్లాక్ చేసింది. దీంతో మనస్తాపం చెందిన యువకుడు విష్ణు అమ్మాయి ప్రేమను వదులుకోలేక తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన మృతదేహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరంలో ట్రేస్ చేసుకోవాలని సూసైడ్ లెటర్ రాసి, సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ పోస్టుతో అప్రమత్తమైన విష్ణు బంధువులు, స్నేహితులు సదరు విషయాన్ని నేరుగా విజయనగరం ఎస్పీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఆ యువకుడి ఆచూకీ కనిపెట్టి, రక్షించే చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించిన మేరకు రంగంలోకి దిగిన వన్ టౌన్ సీఐ శ్రీనివాస్ తన బృందంతో టెక్నాలజీని వినియోగించి విశాఖపట్నం, చీపురుపల్లి, విజయనగరంలలో పలు ప్రాంతాల్లో గాలించి, చివరికి యువకుడి ఆచూకీని విజయనగరం రైల్వేస్టేషన్‌లో మార్చి 11న రాత్రి కనుగొన్నారు. వెంటనే ఆ యువకుడిని విజయనగరం వన్‌టౌన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ నిర్వహించి బంధువులకు సమాచారం ఇచ్చారు. విష్ణు బంధువులు గురువారం రాగానే విజయనగరం డీఎస్పీ ఆఫీస్ లో డీఎస్పీ శ్రీనివాస్ సమక్షంలో అప్పగించారు. సకాలంలో స్పందించి, యువకుడి ఆచూకీ కనిపెట్టి, ఆత్మహత్య ఆలోచనల నుంచి కాపాడిన వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, సిబ్బందిని డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్‌ను ఎస్పీ వకుల్ అభినందించారు. యువకుడ్ని కాపాడడంలో చొరవ చూపి, సమయానుకూలంగా అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ వకుల్ జిందల్‌కు యువకుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.